ప్రజాశక్తి
సోమవారం 10 ఏప్రిల్ 2023
5



అల్లూరి సీతారామరాజు

బాధితులకు ఎమ్మెల్యే ఫాల్గుణ పరామర్శ

ప్రజాశక్తి-పెదబయలురూరల్: మండలంలోని కుంతర్ల పంచాయతీ కిండలం గ్రామంలో అరకు ఎమ్మెల్యే ఫాల్గుణ ఆదివారం పర్యటించారు. ఇటీవల కిండలం గ్రామంలో వరుసగా ఆదివాసులు వివిధ రోగాలతో సహజ మరణాలు మృతి చెందడంపై ఇంటింటా సందర్శించి ఓదార్చారు. మూఢ నమ్మకాల పై దృష్టి పెట్టి వద్దని సూచించారు. మృతుల కుటుంబాలకు రూ.10వేల చొప్పున వ్యక్తిగత ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి నాయకులు, జెడ్పిటిసి సభ్యులు కూడా బొంజుబాబు, ఆనందరావు, మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ, సూరయ్య పాల్గొన్నారు.



సరుకులు ఇస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

మన్యంలో సందడే..సందడి

▸▸ ఉత్సాహంగా గిరిజనుల థింసా నృత్యాలు ▸▸ ఘనంగా గిరిజన గ్రామాల్లో ఇటుకల పండగ



చందాలు వసూలు చేస్తున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఏజెన్సీ అంతటా ప్రస్తుతం ఇటుకల పండుగతో సందడి వాతావరం నెలకొంది. గిరిజనులు సంప్రదాయ థింసా నృత్యాలు, డప్పుల మోతలు, రకరకాల ఆటపాటలతో ఉల్లాసంగా గిరిజనులు గడుపుతున్నారు. మహిళలు రహదారులపై గేట్లను (తాడుతో) పెట్టి, వాహనదారులు, ప్రయాణికుల నుంచి పజోర్ (తాచేరు పండుగ చందా) వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని వారిపై రంగు నీళ్ళ చల్లి హడావుడి చేస్తున్నారు. ఏటా చైత్రమాసంలో జరిగే ఇటుకల పండుగ విశిష్టత, ప్రాశస్త్యం, విశేషాలపై ప్రత్యేక కథనం.....

మగవారు అడవిలోకి వేటకు...

ఏజెన్సీలోని గిరిజనులు ఇటుకల పండుగను దాదాపు అన్ని గ్రామాల్లో చైత్ర మాసంలో ఏదో ఒక రోజు జరుపుకుంటారు. ఇటుకల పండుగ సమయంలో పురుషులు తమ వీరత్వాన్ని చూపాలి. లేకపోతే తమతో సమానమంటూ మహిళలు వారికి ఆటపట్టిస్తూ చీరలు కడతారు. వీరత్వాలు ఏమిటంటే.. గ్రామానికి చెందిన పురుషుల సమీపంలోని అడవిలోకి వేటకు వెళ్లి ఏదైనా జంతువును వేటాడి ఊర్లోకి రావాలి. లేకపోతే మహిళలు రానివ్వరు. ఇటువంటి వారిని ఆ గ్రామ పొలిమేర్లలో మహిళలు అడ్డుకుని జరిమానా వసూలు చేస్తారు. ఆ డబ్బులను ఇటుకల పండుగ కోసం ఖర్చు చేస్తారు. ఊరంతా సహపంక్తి భోజనాలు చేస్తారు. పండుగ రోజు సాయంత్రం మహిళలు దింసా నృత్యాలు చేస్తారు.

పజోర్ వసూలు

గ్రామాల్లో పజోర్ (తాచేరు పండుగ చందా) వసూలు కాస్తా ప్రధాన రహదారులపై తాత్కాలిక గేట్లు పెట్టి వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. జాతీయ రహదారిపై టోల్ గేట్ల వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖుల వాహనాలకు ఫీజు మినహాయింపు ఉంటుంది. కానీ మన్యంలో ఇటుకల పండుగ సందర్భంగా గిరిజన మహిళలు ఏర్పాటు చేసే గేట్ల వద్ద ఎవరికీ మినహాయింపు ఉండదు. ద్విచక్ర వాహనదారుల నుంచి లారీలు, బస్సుల వరకు ఎవరైనా సరే డబ్బులు ఇచ్చి కదలాలి. లేదంటే రంగు నీళ్ళ చల్లుతారు.

పండుగ సంప్రదాయం

చైత్రమాసం తొలి రోజున గిరిజనులు తమ పొలాల్లో పండించిన ఆహార పంటల్లో నుంచి కొద్దిగా గింజలు తీసుకొని గ్రామ పొలిమేరల్లో ఉండే సంకుదేవుడి వద్ద పెట్టి కోడిని కోసి పూజలు చేసేవారు. రానున్న కాలంలో పంటలు బాగా పండాలని మొక్కుకుంటారు. పూజలో ఉంచి గింజలను భద్రపరచి వర్షాలు పడిన తర్వాత పంట పొలాల్లో చల్లుతారు. ఇదిలా ఉండగా ఇటుకల పండుగ సందర్భంగా బాణమరుదల వరుస అయ్యేవాళ్ళు వేర్వేరు బృందంగా ఏర్పడి, వివిధ రకాల పోటీలు పెట్టుకుంటారు. బాణంతో కోడి గుడ్డును కొట్టడం, అడవిలోంచి తీసుకువచ్చిన తాడు లాంటి బద్దను లాగడం వంటి ఆటలు ఆడతారు. బాణం గురి తప్పకుండా గుడ్డుకు తగిలితే వేటలో విజయం సాధిస్తామని వారి విశ్వాసం. అలాగే చిన్నపిల్లల కోసం గ్రామంలో ఊయ్యాలలు కడతారు.

పాత పాడేరులో కోలాహలం...

పాడేరు: పట్టణంలోని పాత పాడేరులో ఆదివారం సాయంత్రం ఇటుకల పండుగ కోలాహలంగా సాగింది. గ్రామంలోని మహిళలు దింసా నృత్యాలతో సందడి చేశారు. చిత్ర విచిత్ర వేషాలతో నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా ఆడి పాడి అలరించారు. బద్ద ఉత్సవంలో అక్కా చెల్లెళ్ళు వదిన మరదళ్ల మధ్య బల ప్రదర్శన జరిగింది. ఈ బల ప్రదర్శన హోరాహోరీగా సాగింది. చివరికి అక్కాచెల్లెళ్లే విజయం సాధించారు. శనివారం పురుషుల మధ్య జరిగిన బల ప్రదర్శనలో వరుసకు అన్నదమ్ములు గెలవగా నేడు అక్కాచెల్లెళ్ల వరుస ఉన్న మహిళలు గెలవడం విశేషం.

ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

పురాతన ఆయుధాలకు పూజలు

పెదబయలురూరల్: మండలంలోని సీతగుంట, పెదబ యలులో ఇటుకల పండగ పురస్కరించుకొని గ్రామస్తులు ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తుడుం, డప్పు వాయిద్యాలతో కనువిందు చేశారు.

జిఒ 52పై ఎమ్మెల్యే వైఖరి స్పష్టం చేయాలి

★ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత రామారావు

ప్రజాశక్తి- చింతూరు : ఆదివాసీల గొంతు కోసేవిధంగా బోయ/వాల్మీకులు, బెంతుఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానంపై అసెంబ్లీలో నవ్వుతూ ఓకే చెప్పిన ఎమ్మెల్యే ధనలక్ష్మి, దీనిపై జారీ చేసిన జిఒ 52పై తన వైఖరి ఏంటో బహిరంగంగా స్పష్టం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానానికి ఆమోదం తెలిపి, ఇపుడు దరఖాస్తులివ్వడం జగనన్నతో మాట్లాడతాను, ఈ జిఒ వల్ల కలిగే నష్టాలను గుర్తుచేస్తానంటూ గాలిమాటలు మాట్లాడడం మానుకోవాలన్నారు. జిఒ 52పై తన వైఖరేంటో గిరిజనులందరికీ తెలిసేలా బహిరంగ ప్రకటన చేయాలని కోరారు.

ఆదివారం చింతూరులో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపలి .సిరిమల్లి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ జిఒ52ను వ్యతిరేకిస్తూ రంపచోడవరం ఏజెన్సీతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీలంతా ఉద్యమాలు, బంద్‌లతో ఆందోళన చేస్తుంటే, గిరిజనుల గోస ఎమ్మెల్యే ధనలక్ష్మికి వినబడడం లేదా? కనిపించదాయని ప్రశ్నించారు. ఓట్లేసి గెలిపించిన ఆదివాసీల పక్షాన నిలుస్తారో, జగనన్న సంతోషం కోసం బోయ/వాల్మీకుల పక్షాన నిలిచి గిరిజన ద్రోహిగా మిగిలిపోతారో ఎమ్మెల్యే ధనలక్ష్మి తేల్చుకోవాలని హెచ్చరించారు. ఈ విషయంపై మౌనం ఎంతమాత్రం సమాధానం కాదని, దరఖాస్తులిస్తే ఏదో చేసేస్తానని నమ్మబలకడం సరికాదని హితవు పలికారు. గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ జిఒ 52 వల్ల కలిగే నష్టంపై అవగాహన పెంచుకుని, ఆదివాసీ యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు అందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిఒ3 విషయంలో జరిగిన నష్టం ఏంటో అందరికీ తెలిసిందేనని, ఇపుడు జిఒ 52 పుండుమీద కారం చల్లినట్లు తీసుకొచ్చి, నిజమైన ఎస్‌టిలకు అన్యాయం చేస్తున్నారనానరు. దీనిపై వెంటనే మేల్కొని, సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కాకా అర్జున్, సీసం.సురేష్, కారం నగేష్, పూనెం ప్రదీప్‌కుమార్, పులి బొజ్జి బాబు బొర్రయ్య, తీగల శ్రీను, ఆవుల ధర్మారెడ్డి, అపక సమ్మక్క, మడకం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో పట్టభద్రులకు మెరుగైన ఉపాధి అవకాశాలు

-గ్రామీణ అధ్యయన కేంద్రాల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచడానికి కృషి
-ఈ ఏడాది నుంచి మరికొన్ని కొత్త కోర్సులు
-'ప్రజాశక్తి'తో ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు ధర్మారావు



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) పట్టభద్రులకు మెరుగైన ఉపాధి అవకాశాలు దక్కుతున్నట్టు వర్సిటీ విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇటీవల వర్సిటీ 37వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇగ్నో ప్రగతి, కోర్సుల వివరాలు, భవిష్యత్తు ప్రణాళికలను తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం పనితీరు ఎలా ఉంది ?

ఇగ్నో ప్రాంతీయ కేంద్రం విశాఖపట్నంలో 2011 మార్చి 29న ఏర్పాటైంది. రాష్ట్రంలో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం రెండోది. మా కేంద్రం పరిధిలో జిల్లాల విభజన అనంతరం 11 జిల్లాల పరిధిలో 12 అధ్యయన కేంద్రాలను నిర్వహిస్తున్నాం. వీటిలో విశాఖపట్నం జిల్లాలో 4, తూర్పుగోదావరి జిల్లాలో 3, శ్రీకాకుళం జిల్లాలో 1, విజయనగరం జిల్లాలో 2, ఏలూరులో 2 కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలన్నీ ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉన్నాయి. విద్యార్థులు తమ అనుమానాల నివృత్తి, సహాయ సహకారాల కోసం ఈ 12 సెంటర్లనూ సంప్రదించవచ్చు. మా సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఇగ్నో ద్వారా ఎవరైనా డిగ్రీ, పీజీ అభ్యసించాలనుకుంటే ఈ అధ్యయన కేంద్రాలకు వెళ్తే పూర్తి సమాచారం లభిస్తుంది.

వర్సిటీ ప్రాంతీయ కేంద్రం పరిధిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు ?

ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో ఇప్పటివరకూ 5150 మంది విద్యను అభ్యసిస్తున్నారు. అదేవిధంగా మొన్న జరిగిన 36వ వార్షిక స్నాతకోత్సవంనాటికి 1200 మంది పట్టభద్రులు అయ్యారు. వీరిలో 873 మంది డిగ్రీ , పీజీ విద్యార్థులుకాగా 367 మంది వివిధ రకాల సర్టిఫికేషన్ కోర్సులలో ఉత్తీర్ణత సాధించారు.

ఇగ్నోలో అందుబాటులో ఉండే కోర్సులు ఏంటి ?

మా ప్రాంతీయ కేంద్రం పరిధిలో బిఎ, బికాం, బిఎస్‌సిలతోపాటు బిఎ హానర్స్‌కు సంబంధించి అన్ని డిగ్రీలూ అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా స్పెషల్ హిందీ, స్పెషల్ ఉర్దూ భాషల్లో డిగ్రీలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు పీజీలో ఎంఎ ఇంగ్లీష్, ఎంఎ తెలుగు, ఎంఎ సంస్కృతం, ఎంఎ టూరిజం మేనేజ్‌మెంట్, ఎంఎ జర్నలిజం, ఎంబిఎ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీతో పాటు పలు పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పలురకాల సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాం. వాటిలో ముఖ్యంగా బిజినెస్ స్కిల్, కమ్యూనిటీ రేడియో, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, కన్స్యూమర్ ప్రొటెక్షన్, ది ఎనర్జీ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌తో పాటు పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి.



భవిష్యత్తు ప్రణాళికలు ఎలా ఉండనున్నాయి ?

ఈ ప్రాంతీయ కేంద్రం పరిధిలోని గ్రామీణ అధ్యయన కేంద్రాలలో విద్యార్థుల అడ్మిషన్లు పెంచడానికి, నిరుద్యోగ గ్రామీణ యువతకు తోడ్పాటునందించే కొత్త నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభించడానికి కృషి చేస్తున్నాం. వాటిలో ఈ ఏడాది నుంచి కొత్తగా ఎంఎ జర్నలిజంలో ఎంఎ డిజిటల్ మీడియా, ఎంఎ ఎలక్ట్రానిక్ మీడియా కోర్సులు ప్రవేశ పెడుతున్నాం. అలాగే వివిధ కొత్త కోర్సులను విశాఖపట్నం ప్రాంత విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నాం. ఇగ్నో అధ్యయన కేంద్రాలు లేనిచోట కొత్త అధ్యయన కేందాల ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించాం. ఇగ్నో అధ్యయన కేంద్రం విస్తరణలో భాగంగా విశాఖపట్నంలో ఐదో సెంటర్‌గా విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కొత్త అధ్యయన కేంద్రాన్ని అతి త్వరలో ప్రారంభించనున్నాం. పార్వతీపురం మన్యంలో పాలకొండ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, అరకు ప్రాంతాల్లో కొత్త అధ్యయన కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

జిఒ 52 రద్దు చేయాలని నిరసన



మాట్లాడుతున్న ఆదివాసీ నేత

ప్రజాశక్తి - రంపచోడవరం : బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానంతోపాటు జారీ చేసిన జిఒ 52ను తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం జిఒ 52ను నిరసిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని రంప, పెద గెద్దాడ పంచాయతీ పెద గెద్దాడ, కుంజంవీధి గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కంగల శ్రీనివాసు, చవలం తమ్మన్న దొర, చవలం శుభ కృష్ణ, పొడియం పండు దొర, తీగల అచ్చిరాజు, కారం బాలుదొర, కంగల ప్రవీణ్, కంగల అబ్బాయి దొర, బందం కృష్ణ, గ్రామ పెద్దలు చెదల చెల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌జిటి పోస్టుల రద్దు సరికాదు: యుటిఎఫ్

ప్రజాశక్తి-పాడేరు: విద్యారంగంలోని సంస్కరణలు పేరిట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్ గిరిజన ప్రాంతాల్లో 204 ఎస్‌జిటి ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేయడం సరికాదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు ఖండించారు. దీంతో గిరిజన విద్యార్థులకు, నిరుద్యోగులు తీవ్రమైన నష్టం కలుగు తుందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజనులు అభివృద్ధి సాధించాలంటే విద్య ఒక్కటే మార్గం అయినప్పటికీ ఉపాధ్యాయ పోస్టులు రద్దు పరచడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయంతో ప్రాథమిక హక్కు హరించడమేనని, రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు పేరుతో పాఠశాలలను అందంగా ముస్తాబు చేస్తూ మరో వైపు పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులన్నీ కుదించడం ఎంతవరకు సబబన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రాథమిక పాఠశాలలన్నీ ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిన పరిస్థితి ఈ పరిస్థితిలో పేద గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో చాలా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయాలని గిరిజనులు ఎన్నో సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా పోస్టులు రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం గిరిజనుల విద్యను దెబ్బ తీసే నిర్ణయాన్ని మార్చు కోకపోతే భవిష్యత్తులో ఆందోళనలు తప్పవని తెలిపారు.

వైద్యులు లేక సేవలు మృగ్యం!

▸▸ నాలుగు వైద్యాధికారుల పోస్టులూ ఖాళీయే...
▸▸ రోగులకు కిందిస్థాయి వైద్యసిబ్బంది సేవలే దిక్కు
▸▸ 30పడకలున్నా నిష్ప్రయోజనం
▸▸ సాదాసీదా రోగాలకు సైతం రిఫరల్ శరణ్యం
▸▸ అవస్థలు పడుతున్న మన్యవాసులు
▸▸ పట్టించుకోని నేతలు, అధికారులు
▸▸ ఇదీ కోతులగుట్ట సిహెచ్‌సి దుస్థితి



ఒక్క వైద్యుడైనా లేని కోతులగుట్ట సిహెచ్‌సి

ప్రజాశక్తి - కూనవరం : పేరుకే 30 పడకల సామాజిక ఆసుపత్రి. ఒక్కరంటే ఒక్కరు డాక్టర్ ఉంటే ఒట్టు. అనారోగ్యంతో ఆసుపత్రికి వస్తే కిందిస్థాయి సిబ్బంది వైద్యసేవలే దిక్కు. ఇక అత్యవసర అనారోగ్య పరిస్థితి అయితే రిఫరల్ శరణ్యం. అల్లూరి జిల్లా రంపచోడవరం మన్యంలో గిరిజనుల వైద్యఆరోగ్యసేవల పట్ల ప్రభుత్వం, పాలకులు, అధికారుల చిత్తశుద్ధి లేమికి, నిర్లక్ష్యానికి కూనవరం మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, కూనవరం పిహెచ్‌సిలో నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తున్నాయి.

అల్లూరి జిల్లా రంపచోడవడరం డివిజన్ కోతులగుట్ట సిహెచ్‌సిలో నలుగురు వైద్యాధికారులు పోస్టులున్నప్పటికీ, ఒక్కరు కూడా విధుల్లో లేకపోవడంపై వైద్యసేవలు మృగ్యమౌతున్నాయని గిరిజన రోగులు ఆవేదన చెందుతున్నారు. నలుగురు వైద్యుల్లో ఇద్దరు వేరొకచోటుకు వెళ్లిపోగా, మరొకరిని డెప్యుటేషన్ వేసినట్లు తెలుస్తోంది. మిగిలిన జనరల్ సర్జన్ డాక్టర్ కొన్నాళ్లపాటు పనిచేసినా, ఏమైందేమోగానీ ఆయన కూడా విధులకు రావడం లేదని, దీంతో నలుగురు వైద్యులుండాల్సిన ఈ 30 పడకల ఆసుపత్రికి వచ్చే రోగులకు కిందిస్థాయి వైద్యసిబ్బంది సేవలే దిక్కుగా మారాయి. మామూలు రోజుల్లో సగటున 150వరకు అవుట్ పేషెంట్లు వస్తుండగా, మామూలు వ్యాధులైతే, ఇక్కడున్న సిబ్బంది మాత్రలో, ఇంజెక్షన్లో ఇచ్చి మొక్కుబడి వైద్యం చేసి పంపించేస్తున్నారని స్థానికులు అంటున్నారు. 30పడకలున్నా వైద్యం చేసే డాక్టర్లు లేకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయని అంటున్నారు.



కొన్నాళ్లుగా తలుపు తాళాలు తీయని కూనవరం పిహెచ్‌సి

ఇక అత్యవసర వైద్యం అవసరమైతే రోగులే కోతులగుట్ట సిహెచ్‌సికి రాకుండా, ఇతరప్రాంతాల ఆసుపత్రులకు నేరుగా వెళ్లిపోతున్నారు. అలా కాకుండా ఆసుపత్రికి వస్తే వారికి రిఫరలే దిక్కు. విషమ పరిస్థితుల్లో ఉన్న రోగులొస్తే వారిని 30కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతపల్లికి లేదా 50కిలోమీటర్లు పైబడి దూరాన ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం ఆసుపత్రికి రిఫర్ చేయక తప్పడం లేదు. దీంతో అక్కడికి వెళ్లేలోగానే సీరియస్ పేషెంట్ల ప్రాణాలు హరీ అంటున్నాయని మన్యవాసులు ఆవేదన చెందుతున్నారు. కిందస్థాయి సిబ్బంది, అవసరమైన వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలతోపాటు 30పడకలున్నప్పటికీ, వైద్యులు లేకపోవడంతో కోతులగుట్ట సిహెచ్‌సిలో వైద్యసేవలు ప్రథమ చికిత్సకు, రిఫరల్‌కు పరిమితమయ్యేలా నామమాత్రం కావడంపై గిరిజనులు ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి, కోతులగుట్ట సిహెచ్‌సిలో వైద్యులను నియమించి, సేవలను మెరుగుపరచాలని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు. కాగా కోతులగుట్ట సిహెచ్‌సికి కూనవరం పిహెచ్‌సి నుంచి ఇద్దరు వైద్యులను డెప్యుటేషన్ వేయగా, వారు వచ్చి విధుల్లో చేరాల్సి ఉంది. అయితే అలా కాకుండా ఆసుపత్రిలో ఉండాల్సిన జనరల్ సర్జన్, పీడియాట్రీషియన్, ఇతర వైద్యనిపుణుల పోస్టులను భర్తీ చేయాలని పలువురు అభ్యర్థిస్తున్నారు.

కూనవరం పిహెచ్‌సి పరిస్థితి మరీ దారుణం

కూనవరంలో పిహెచ్‌సి ఉన్నప్పటికీ అది ఏ నాడూ తెరుచుకున్న పాపాన పోలేదని స్థానికులు అంటున్నారు. కూనవరం ఆసుపత్రికి వైద్యులు, సిబ్బంది ఎవరూ లేరో, ఉన్నారో తెలియదుగానీ, ఎపుడూ తలుపులు తాళాలు వేసే ఉంటాయని స్థానికులు అంటున్నారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉండగా, ఇటీవల స్థానిక ఎమ్మెల్యే ధనలక్ష్మి ఈ పిహెచ్‌సిని అట్టహాసంగా పున:ప్రారంభించారు. ఆ ఒక్కరోజే తప్ప, తర్వాత రోజు నుంచి తలుపుతీస్తే ఒట్టు. ఇక ఎమ్మెల్యే చొరవతో ఈ పిహెచ్‌సికి ఇటీవల చేపట్టిన నియామకాల్లో ఇద్దరు వైద్యులను నియమించినట్లు తెలుస్తోంది. అయితే ఇన్నాళ్లుగా మూసేసిన ఆసుపత్రిలో వీరు ఎందుకని అనుకున్నారేమో గానీ, వారిని కోతులగుట్ట సిహెచ్‌సికి డెప్యుటేషన్ వేసినట్లు తెలుస్తోంది. కూనవరం పిహెచ్‌సి తాళాలు తెరుచుకోవడం, డాక్టర్లను నియమించారన్న విషయం ఈప్రాంతీయులకు తెలియని పరిస్థితులు కల్పించి, మూన్నాళ్లముచ్చటగా చేయడం ఎంతవరకు సబబో అధికారులు, నేతలే చెప్పాల్సిన అవసరం ఉంది.

పాడేరులో భారీ ర్యాలీ



ర్యాలీ చేపడుతున్న నేతలు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సంస్కతి సాంప్రదాయాలను విశ్వాసాలను విడిచిపెట్టి కరాయిస్తవా లేదా ఇస్లాం మతంలోకి మారిన గిరిజనులు షెడ్యూల్డ్ తెగకు చెందిన సభ్యులుగా పరిగణించబడరని, ఈ విధంగా మతం మారిన గిరిజనులను షెడ్యూల్డ్ తెగల జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ జన జాతి(గిరిజన) సురక్ష మంచ్ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం భారీ ర్యాలీ నిర్వహించారు తలారి సింగ్ నుంచి చంద్రు పుట్టు మెయిన్ రోడ్డు మీదుగా అంబేద్కర్ జంక్షన్ మీద నుంచి సభాస్థలి జూనియర్ కళాశాల వరకు అతి పొడవైన ర్యాలీ కొనసాగింది. పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబూరావు మాట్లాడుతూ, మతం మారిన గిరిజనులకు ఎస్టీ రిజర్వేషన్ వర్తించదని , దీనిపై పార్లమెంట్లో బిల్లు తేవడానికి కేంద్ర ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకోబోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వామీజీలు పాల్గొన్నారు.

పిడుగు శబ్దాలతో వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలో ఆదివారం భారీ పిడుగు శబ్దాలతో వర్షం కురిసింది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోతకు గురైన గిరిజనులకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. పిడుగు శబ్దాలు అధిక శబ్దాలతో రావడంతో గిరిజనులు భయాందోళనకు గురయ్యారు.

గిరిజనులకు భవిష్యత్ ఏదీ?

ప్రజాశక్తి-హుకుంపేట: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం వైసిపి నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే ఉపయోగపడుతుందని, గిరిజన జాతికి భవిష్యత్ ఏదని గిరిజన సంఘం నేత క్రిష్టారావు పత్రిక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి చేసింది ఏమిలేదన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిదన్నారు. ఆశ్రమల్లోని హెల్త్ వర్కర్లను తొలగించి విద్యార్థుల ఆరోగ్యాన్ని గాలి కొదిలేసిందన్నారు. జీఓ 3పై సుప్రీంకోర్టులో పిటీషన్ వేయలేదని తెలిపారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలు మూసేసి ఉపాధ్యాయ ఉద్యోగాలను రద్దు చేసిందని విమర్శించారు.

మైనర్లకు వాహనాలిస్తే యజమానిపై క్రిమినల్ కేసు




వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : డ్రైవింగ్ లైసెన్స్ ఉండని మైనర్లకు వాహనాలిస్తే, సంబంధిత వాహన యజమానికి కేసు నమోదు చేయక తప్పదని రాజవొమ్మంగి ఎస్ఐ టిజి. నరేంద్రప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక అల్లూరి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. జడ్డంగి, రాజవొమ్మంగి జాతీయ రహదారి మీదుగా వచ్చి, పోయే వాహనాలను ఆపి, రికార్డులు పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు ఇతర విషయాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ నరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, వాహనదారుడు తప్పనిసరిగా వాహనానికి సంబంధించి అన్ని పత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, గంజాయి, నాటుసారా వంటి నిషేధిత పదార్థాలను రవాణా చేయరాదని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలిస్తే, ఏదైనా ప్రమాదం జరిగితే సంబంధిత యజమానిపై క్రిమినల్ కేసు తప్పదని హెచ్చరించారు. వాహనతనిఖీల్లో పట్టుబడినా చర్యలుంటాయన్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, వాహనరికార్డులు, ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రికార్డులు సరిగా లేని పలువ వాహనదారులకు జరిమానా విధించడంతో పాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నామని భరోసా కల్పించండి



మాట్లాడుతున్న టిడిపి నేత కారం సురేష్

ప్రజాశక్తి - రంపచోడవరం : వైసిపి అరాచక పాలనతో ఆందోళనకర పరిస్థితుల్లో ఉన్న రాష్ట్ర ప్రజలకు ప్రతి టిడిపి కార్యకర్త మేమున్నామని భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని పార్టీ మండల అధ్యక్షుడు కారం సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, మండలంలో నిర్వహించాల్సిన హౌస్ మ్యాపింగ్‌పై చర్చించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు రాష్ట్ర భవిష్యత్, ప్రజల సంక్షేమానికి టిడిపి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలోనూ, పార్టీలోనెలకొన్న పలు అంశాలు, సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షులు కారం సింహాచలం, పార్టీ ప్రధాన కార్యదర్శి అనంత మోహన్, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు వంతల అచ్చయమ్మ, ఎస్‌టి సెల్ మండల అధ్యక్షులు కుంజం బాపన్న దొర, ఐటిడిపి కోఆర్డినేటర్ మడకం పండు దొర, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న పాస్టర్లు

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈస్టర్ పండుగ సందర్భంగా పాడేరు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు జిల్లా ఆసుపత్రిలో రోగులకు ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలోని రోగులు త్వరగా కోలుకోవాలని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు దేవిడ్, పాపిరి రాజు, ఇశ్రాయేలు, జాషువా, మత్స్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ ఉక్కుర్బ గ్రామంలో భీమలింగేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, విశాఖ పీఠాధిపతి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు ఆకే చిట్టిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ మీదుగా భారీ ఊరేగింపు నిర్వహించారు. జ్ఞాన సాగర్ ఓకేనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది శివలింగాని ప్రదర్శించారు.

492వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో ఫైప్ లైన్ అనుమతులు రద్దు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 492వ రోజుకు చేరింది. ఆదివారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, పైపులైన్‌కు వ్యతిరేకంగా తామంతా 492 రోజుల నుండి శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ, ఇవేమీ పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైప్ లైన్ కు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. వేట తప్ప మరో వృత్తి తమకు తెలియదని, సముద్రం పై ఆధారపడి తామంతా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. సముద్రాన్ని కలుషితం చేసే ఈ పైప్‌లైన్‌కు అనుమతులను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. తమ జీవన విధానం దృష్టిలో పెట్టుకొని కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, వాసుపల్లి స్వామి, మైలపల్లి బాబ్జి, బొంది నూకరాజు, పిక్కి తాతాజీ, గోసల ఎల్ల, పిక్కి రామ్ చరణ్, పొడిపల్లి రాజు, కారే రాజు, కారే కొండలరావు, పిక్కి కోటి, మైలపల్లి శివ, జానకి, కోడా కాశీరావు, కారే సతీష్, బోగద తాతాజీ పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా ఇవ్వాలి

ప్రజాశక్తి- నక్కపల్లి: సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులందరికీ ప్రభుత్వం మత్స్యకార భరోసా వర్తింప చేయాలని జాతీయ మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షులు కొవిరి వెంకటేష్ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ, మత్స్యకార భరోసాపై ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గెజిట్‌తో మత్స్యకారులందరికీ తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలకు మత్స్యకార భరోసా లింకు చేసి వేట నిషేధ సమయంలో ఇస్తున్న భరోసాను కుదించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలలో ఏ ఒక్క పథకం అయినా ఆ కుటుంబం లబ్ది పొందితే మత్స్యకార భరోసాకు అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దీంతో, మత్స్యకారులకు తీరని అన్యాయం జరుగుతుంద న్నారు. ప్రభుత్వ పథకాలు, కరెంటు బిల్లులతో సంబంధం లేకుండా వేట సాగిస్తున్న ప్రతి మత్స్యకార కుటుంబానికి మత్స్యకార భరోసా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు: పాడేరులో క్రీస్తు పునరుత్థాన పండుగ (ఈస్టర్)ను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. 45 రోజుల ఉపవాస ప్రార్ధనలు శనివారం రాత్రితో ముగించారు. ఈస్టర్ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలతో పాటు, ప్రేమ విందు ఏర్పాటు చేశారు. చర్చిలలో ప్రత్యేక ఆరాధన నృత్య గానాలతో సాగాయి. కారుణ్య చర్చిలో బిషప్ దైవ కృప, ప్రభువైన ఏసుక్రీస్తు ప్రార్ధన మందిరంలో పాస్టర్ జి.తిమోతి వాక్యోపదేశం చేశారు.

హుకుంపేట: స్థానిక పరిశుద్ధ థామస్ ప్రార్ధన మందిరంలో ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు భక్తి గీతాలను ఆలపించారు. స్థానిక పాస్టర్ కె.జేమ్స్ మాట్లాడుతూ, కల్వరి సిలువలో ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, త్యాగము ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు, సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విఆర్.పురం: క్రీస్తు పునరుత్థాన పండుగను ఈస్టర్ సండేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని సంత పాపల వద్ద షాలోమ్ ప్రార్ధన మందిరంలో ప్రత్యేక ఆరాధన, ప్రేమ విందు నిర్వహించారు. పాస్టర్ దేవిడ్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే రోజున పాప విమోచన కొరకు శిలువ వేయబడి మరణం పొందిన ఏసుక్రీస్తు పునరుత్థానం పొందిన రోజైన ఈస్టర్ సండేను వేడుకగా జరుపుకున్నారు. వేకువజాము నుంచి ప్రార్ధనలను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.



క్రీస్తు గేయాలు ఆలపిస్తున్న బాలికలు

పలుచోట్ల 'నువ్వే మా నమ్మకం జగనన్న'



గోడలపై స్టిక్కర్లు అతికిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని డౌనూరు సచివాలయం, మూలపేట గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో జెడ్‌పిటిసి వారా నూకరాజు, ఎంపిటిసి బి.అప్పారావు, సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి, కన్వీనర్లు పొట్టిక పోతురాజు, సురేష్, నూకరాజు పాల్గొని, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పథకాలతో పోల్చి వ్యత్యాసాలను వివరించారు. అంతకుముందు కార్యక్రమం విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై జెడ్‌పిటిసి నూకరాజు, ఎంపిటిసి అప్పారావులు పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు దుంపా రాజుబాబు, దేవూరి పోతురాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

గిరిజనుల ఆదరాభిమానాలు ఎనలేనివి

ప్రజాశక్తి-పాడేరు / హుకుంపేట : గిరిజన ప్రాంతాలు అభివృద్ధిలో వెనుకబడి ఉండొచ్చని, విజ్ఞత, ఆదరాభిమానాలను చాటడంలో గిరిజనులు ముందుంటారని విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి ప్రశంసించారు. ఆదివారం ఆయన పాడేరులోని మోదకొండమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఉత్సవ కమిటీ సభ్యులు స్వామిని సత్కరించి మోదకొండమ్మ అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అక్కడి నుండి హుకుంపేట మండలం తడిగిరి పంచాయతీ ఉక్కుర్బ గ్రామానికి వెళ్ళారు. భీమలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో పాల్గొన్నారు. ఎంత ఖర్చయినా వెనుకాడకుండా ఆలయానికి కరెంటు సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యే శెట్టి పాల్గుణకు సూచించారు. ఈ సందర్భంగా స్వాత్మానందేంద్ర స్వామి మాట్లాడారు. గిరిజనులంతా ఆలయాలను దర్శించాలని సూచించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఐదు అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి కె.శ్రీగౌరి తెలిపారు. గొలుగొండ మండలంలో రెండు కేంద్రాలు, నాతవరం మండలంలో మూడు కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిందన్నారు. గొలుగొండ మండలంలో కొత్తమల్లంపేట-1 ఓసికి, కొంగసింగి-1 బిసి-ఎ కేటగిరికి కేటాయించినట్లు తెలిపారు. ఆయా కేటగిరీలకు చెందినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాతవరం మండలంలో నాతవరం-3 కేంద్రం ఎస్సీ కేటగిరి, గుమ్మడికొండ పంచాయతీ చిక్కుడుపాలెం కేంద్రానికి ఓసి, లింగంపేట పంచాయతీ బుచ్చింపేట కేంద్రం బిసి-ఎ కేటగిరికి కేటాయించారని, ఆయా కేటగిరీలకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకునేవారు 2023 జులై 1 నాటికి 21 సంవత్సరాలు పూర్తయి 35 సంవత్సరాలకు మించకుండా ఉండాలన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులు చేసుకోవాలని, అర్హత కలిగిన వారు ధృవపత్రాలతో దరఖాస్తులను 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రిజిస్టర్ పోస్టు లేదా నేరుగా గొలుగొండ ప్రాజెక్ట్ కార్యాలయానికి అందించాలని ఆమె తెలిపారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన గిరిజనుడు మృతి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మిరియాలు కోస్తూ ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి జారి పడి తీవ్ర గాయాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పాడి విజయకుమార్ ఆదివారం మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండలంలోని శిరగం పంచాయతీ కప్పలగొంది గ్రామానికి చెందిన విజయ కుమార్ డుంబ్రిగుడ మండలం గుమ్మగుడ గ్రామంలో శనివారం మిరియాల చెట్టెక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. బాధితుడిని అరకు ఏరియా ఆసుపత్రికి తరలించిన అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాలి

మృతుడు విజయ్ కుమార్ కుటుంబానికి 5 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని గిరిజన కాఫీ రైతుల సంఘం ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు చిన్న బాబు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ, కాఫీ, మిరియాలు పంట కోసే సమయంలో పాము కాటుకు గురవడం, చెట్టు నుండి జారి పడి అనేక మంది చనిపోతున్నారని తెలిపారు. ఐటీడీఏ కనీసం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాఫీ, మిరియాల రైతులకు ప్రమాద బీమా సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేసారు.

మేఘాద్రిలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి-పెందుర్తి : మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో స్నానానికి దిగిన నిఖిల్ (20) గల్లంతయ్యాడు. మాకవరపాలేనికి చెందిన 8 మంది యువకులు మద్యం తాగడానికి రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. మద్యం తాగిన అనంతరం స్నానానికి దిగారు. ఈ క్రమంలో నిఖిల్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాలతో గాలింపు చేపట్టారు.

గంజాయి స్వాధీనం : ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు పక్కన నేరెళ్లవలస కాలనీ సమీపంలో గంజాయి తాగేందుకు సిద్ధపడిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి 3వ వార్డు ఎగువపేటకు చెందిన రౌడీషీటర్ మేరుగు సతీష్ (25), కుప్ప రాకేష్ కుమార్ (19) గంజాయి తాగేందుకు సిద్ధపడ్డారు. దీనిపై పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 900 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు సిఐ కె.లక్ష్మణమూర్తి, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ రమణ తెలిపారు.

కత్తితో దాడి : ఒకరికి గాయాలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీ బోయపాలెం కూడలిలో మటన్‌షాప్‌లో పనిచేస్తున్న వ్యక్తి కత్తితో దాడి చేయగా ఒకరు గాయపడ్డారు. మటన్ షాపులో పనిచేస్తున్న రెహమాన్ (33) స్థానికంగా ఉన్న తిరుపతి(23) సరదాగా మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో తిరుపతి ఆదివారం రెహమాన్‌తో ఎగతాళిగా మాట్లాడాడు. దీంతో రెహమాన్ కోపోద్రిక్తుడై తిరుపతి మెడపై కత్తితో గాయపరిచాడు. మెడపై గాయమైన తిరుపతిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : భర్త కనిపించడం లేదని పద్మనాభం పోలీసులకు ఆదివారం ఆయన భార్య ఫిర్యాదుచేశారు. దీనికి సంబంధించి పద్మనాభం ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు కథనం ప్రకారం... మండల కేంద్రమైన పద్మనాభం పంచాయతీ పరిధిలో ఉన్న ఇసుకలపాలెం గ్రామానికి చెందిన లంకలపల్లి అప్పారావు (70) ఈ నెల 4వ తేదీ నుంచి కనిపించడం లేదు. బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో భార్య పుష్ప ఫిర్యాదు చేశారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో ఆదివారం చిల్డ్రన్స్ క్లబ్ సందర్భంగా బుక్ రీడింగ్‌ను నిర్వహించారు. అనంతరం దేశ నాయకులపై డిబేట్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల బాలికలు పాల్గొన్నారు.

కమిషనర్ రాజాబాబు వ్యాఖ్యలపై దుమారం

- 'మ్యాడ్ డాగ్' పేరిట ఓ కార్పొరేటర్‌కు మెసేజ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జి 20 సమావేశాల నేపథ్యంలో జివిఎంసి నిధుల ఖర్చుపై ప్రతిపక్ష కార్పొరేటర్ తాజాగా ప్రశ్నించిన విషయమై జివిఎంసి కమిషనర్ రాజాబాబు స్పందించిన తీరు అత్యంత జుగుప్సాకరంగా ఉంది. 'ఒక్క పైసా కూడా ప్రభుత్వం నుంచి రాకుండా, పనులకు ఎంత ఖర్చయిందో లెక్కలు వేస్తున్న క్రమంలో మ్యాడ్ డాగ్ మాదిరి మాట్లాడడం ఏమిటంటూ' ఆ ఉన్నతాధికారి తాజాగా చేసిన వ్యాఖ్యలు అధికార, ప్రతిపక్ష సభ్యుల్లోనేగాక యావత్ విశాఖ నగరంలో దుమారం రేపుతున్నాయి. పనులపై వివరణ సావధానంగా ఇవ్వాల్సిన స్థానంలో ఉన్న అధికారి ఈ రకంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జివిఎంసియే నిధులు ఖర్చు చేసినట్లు ప్రకటించిన ఆ అధికారి, మేయర్ తాజాగా ప్రభుత్వం నుంచి రాలేదని వెల్లడించడం విడ్డూరంగా ఉంది.

కార్పొరేటర్లపై కమిషనర్ వ్యాఖ్యలు దారుణం : సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

ఎంవిపి.కాలనీ : జి 20 సమావేశాల సందర్భంగా చేపట్టిన పనుల్లో జరిగిన కోట్లాది రూపాయల అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్న కార్పొరేటర్లపై జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు పిచ్చి కుక్కలుగా విమర్శలు చేయడాన్ని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్, సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనర్‌గా వ్యవహరించిన ఆయన అధికార పార్టీ నాయకునిగా ప్రతిపక్ష పార్టీల నాయకులను తూలనాడటం, తన అధికార పరిధి దాటి మాట్లాడటం చట్టవిరుద్ధమన్నారు. సభా హక్కుల ఉల్లంఘన కింద కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జి 20 సమావేశాలకు ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదని కమిషనర్ అంటున్నారని తెలిపారు. ఈ సమావేశాలకు పెద్ద ఎత్తున జివిఎంసి నిధుల దుర్వినియోగం జరిగిందని గంగారావు పేర్కొన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేశారని తెలిపారు. అధికార పార్టీ అండతో ఈ అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. ఇప్పటికే పలు మార్లు ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని, బహిరంగ చర్చకు రావాలని సిపిఎం డిమాండ్ చేసిందని, అయినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని అన్నారు. ఇప్పుడు కమిషనర్ మితిమీరి మాట్లాడటం సభాహక్కుల ఉల్లంఘనే అవుతుందని చెప్పారు. తన వ్యాఖ్యలను బహిరంగంగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా జి 20 సమావేశాల సందర్భంగా జివిఎంసి చేపట్టిన వివిధ పనుల్లో జరిగిన కోట్లాది రూపాయల అక్రమాలపై వెంటనే ఫ్లోర్ లీడర్లతో లేదా హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మేయర్‌ని, ఉన్నతాధికారులను కలిసి స్పందనలో ఫిర్యాదు చేయనున్నామని పేర్కొన్నారు.

'రాష్ట్రానికి చంద్రబాబు హానికరం'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు హానికరమని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. ఆదివారం ఉదయం వైసిపి నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్‌ను సొంత బిడ్డలా ప్రజలు ఆదరిస్తుంటే తట్టుకోలేకపోతున్న చంద్రబాబు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు పాలనంతా అవినీతిమయమని పేర్కొన్నారు. 2024 ఎన్నికలతో ఆయన రాజకీయాలు పరిసమాప్తం అవుతాయని జోస్యం చెప్పారు.

విద్యార్థులను కొట్టిన ఘటనపై నివేదిక సమర్పించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయిర్ పోర్ట్ పోలీసు స్టేషన్ పరిధిలోగల శాంతి నగర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలురు ఆడపిల్లలను కామెంట్ చేశారని పేర్కొంటూ ఆ ఇద్దరినీ శుక్రవారం స్తంభానికి కట్టేసి కొట్టారన్న వార్తపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం స్పందించారు. దీనిపై నగర పోలీసు కమిషనర్, సంబంధిత పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బిఎండి ప్రసాద్‌తో మాట్లాడారు. తక్షణమే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. నివేదిక ఆధారంగా సంబంధిత వ్యక్తులపై చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు.

అంధుల చెస్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లాసన్స్ బే కాలనీలో తెలుగు రాష్ట్రాల అంధుల చెస్ పోటీల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఎంపీ జివిఎల్.నరసింహారావు, కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కరణంరెడ్డి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ మే 6, 7 తేదీలలో గాజువాక ఆర్‌జిఐ స్టేడియంలో ఎబిసి ఛారిటబుల్ ట్రస్ట్, ఎఎన్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో జరగబోయే పోటీలకు రెండు వందల మంది క్రీడాకారులు హాజరుకానున్నారని తెలిపారు.

డిఎస్‌సి కష్టమే..!

- ఉమ్మడి విశాఖలో 553 ఉపాధ్యాయ పోస్టులు రద్దు
- నిరుద్యోగుల ఆశలు ఆవిరి
- విద్యకు పెడుతున్న ఖర్చును తగ్గించుకునే కుట్ర
- పేదలకు దూరంకానున్న ప్రాథమిక విద్య

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశలపై ప్రభుత్వం నీళ్లుజల్లింది. భవిష్యత్తులో ఎస్‌జిటి పోస్టుల భర్తీ లేకుండా ఉపాధ్యాయుల మిగులుచూపి రద్దుచేసింది. నూతన విద్యా సంస్కరణలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి, విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి తగ్గించి తొలి దశలో 553 మంది మిగులు ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసింది. మరికొద్ది రోజుల్లో మరికొన్ని ఉపాధ్యాయ పోస్టుల రద్దుకు అవసరమైన కసరత్తు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సంఖ్య పెరగకుండా చూస్తూనే కర్నూలు జిల్లాలో మాత్రం అవసరమైన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఉమ్మడి విశాఖ జిల్లాలో జిఒ 155 ప్రకారం 156 ప్రాథమిక పాఠశాలల్లోని 156 ఎస్‌జిటి పోస్టులను, జిఒ 37ను అనుసరించి 397 ప్రాథమిక పాఠశాలల్లో 397 ఎస్‌జిటిల పోస్టులను ప్రభుత్వం రద్దుచేసింది.

ఉపాధ్యాయ మిగులు పోస్టుల రద్దు, సర్దుబాటు చర్యలతో భవిష్యత్తులో నిరుద్యోగులు ఆశించినట్లు డిఎస్‌సి ఉండదని అర్థమవుతోంది. రెండోవైపు పేదలకు ప్రాథమిక విద్య దూరంకావడంతో పాటు విద్యార్థులను సెక్షన్లుగా విభజించి ఉపాధ్యాయులను తగ్గించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందని పరిస్థితి ఏర్పడనుంది. విద్యకు పెడుతున్న ఖర్చును తగ్గించుకొనేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగంగా ఉపాధ్యాయులను వీలైనంతమేరకు తగ్గించాలని చూస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పి కోట్ల రూపాయలు ఖర్చుచేసిన ప్రభుత్వం నిర్మాణ పనులు పూర్తయిన తరువాత ఒక్కొక్కదాన్నీ మూసివేసుకుంటూ పోతోంది.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మండలాల వారీగా రద్దు చేసిన ఉపాధ్యాయ పోస్టులు ఇలా..

జిఒ 155 ప్రకారం : పెదగంట్యాడ మండలంలో 4, పరవాడలో 13, అనకాపల్లిలో 24, మునగపాకలో 10, కశింకోటలో 14, మాకవరపాలెంలో 13, కోటవురట్లలో 6, పాయకరావు పేటలో 12, నక్కపల్లిలో 16, ఎస్.రాయ వరంలో 13, యలమంచిలిలో 9, రాంబిల్లిలో 11, అచ్యుతాపురంలో 11 ఉన్నాయి.

జిఒ 37 ప్రకారం : ముంచంగిపుట్టు మండలంలో 17, పెదబయలులో 15, హుకుంపేటలో 17, డుంబ్రిగుడలో 15, అరకులోయలో 12, అనంతగిరిలో 21, జికె వీధిలో 14, పాడేరులో 6, జి.మాడుగులలో 22, చింతపల్లిలో 14, కొయ్యూరులో 15, గొలుగుండలో 14, దేవరాపల్లిలో 10, చీడికాడలో 13, వి.మాడుగులలో 13, పెదగంట్యాడలో 4, గాజువాకలో 7, చినగదిలిలో 7, భీమునిపట్నంలో 9, నాతవరంలో 19, నర్సీపట్నంలో 13, రోలుగుంటలో 14, రావికమతంలో 17, బుచ్చెయ్యపేటలో 6, చోడవరంలో 12, కె.కోటపాడులో 14, సబ్బవరంలో 13, పెందుర్తిలో 14, ఆనందపురంలో 22, పద్మనాభంలో 8 ఉన్నాయి.

ఉపాధ్యాయ పోస్టుల రద్దు సరికాదు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 553 ఎస్‌జిటి పోస్టులను రద్దు చేయడం సరికాదు. కర్నూలు జిల్లాలో 1553 ఉపాధ్యాయులు అవసరమని, ఉమ్మడి విశాఖ జిల్లాలో 553 పోస్టులు రద్దుచేసి, కర్నూలు జిల్లాకు తరలించడం అన్యాయం. కర్నూలు జిల్లాకు అవసరమైన పోస్టులు కొత్తగా మంజూరుచేయాలి. ప్రభుత్వ చర్యలు వల్ల భవిష్యత్తులో డిఎస్‌సి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. ఉపాధ్యాయ పోస్టులు రద్దును ఉపసంహరించుకోవాలి.

గొంది చినబ్బాయ్,
యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

లాసిక్ చికిత్సలతో సంధ్య కంటి ఆసుపత్రి రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేత్ర వైద్య రంగంలో విశేష ఖ్యాతి గడించిన సంధ్య కంటి ఆసుపత్రి 10 వేల లాసిక్ చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి కీలక మైలురాయిని అధిగమించింది. కళ్లజోడు, కాంటాక్ట్ లెన్స్‌ల నుంచి శాశ్వతంగా విముక్తి కలిగించేలా అంతర్జాతీయ స్థాయి పర్సనలైజ్డ్ జర్మన్ టెక్నాలజీ లాసిక్ చికిత్సలు ఈ ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఇసుకతోటలోని సంధ్య కంటి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మునగపాటి భార్గవ్‌రామ్ మాట్లాడుతూ సంధ్య కంటి ఆసుపత్రి ద్వారా గడచిన మూడున్నర దశాబ్దాలుగా ప్రజలకు నేత్ర వైద్య చికిత్సలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, ప్రపంచ శ్రేణి కంటి చికిత్సలను ప్రజలకు చేరువ చేశామని తెలిపారు. అత్యంత అనుభవజ్ఞులైన నేత్ర వైద్య నిపుణుల ఆధ్వర్యంలో, నేత్ర సంబంధ వ్యాధులకు నాణ్యమైన చికిత్సలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రముఖ లాసిక్ చికిత్సా నిపుణులు డాక్టర్ శశికపూర్ మాట్లాడుతూ.. సంధ్య కంటి ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిన జర్మన్ టెక్నాలజీ లాసిక్ విధానం ద్వారా దృష్టి లోపాలను అత్యంత ప్రభావవంతంగా పరిష్కరించవచ్చని అన్నారు. సమావేశంలో సంధ్య కంటి ఆసుపత్రి సెంటర్ మేనేజర్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



చికిత్సల వివరాలు వెల్లడిస్తూ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వైద్యులు



క్రీడాకారులతో జానకిరామ్, తదితరులు

జపాన్‌కు టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రోటరీ విశాఖ వ్యాలీ మాజీ ప్రెసిడెంట్ బి.బాబ్జీ నేతృత్వంలో రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ, రొటేరియన్ మంద వెంకట జానకిరామ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఎల్-ఏంజెల్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్ జపాన్ సంయుక్తంగా స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ సహకారంతో టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లను నిర్వహించాయి. ఈ పోటీల్లో టాపర్స్‌గా నిలిచిన నలుగురిని జపాన్‌కు పంపేందుకు ఎంపిక చేశారు. వీరిలో ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు ఉన్నారు. జపనీస్ సహచరులతో ఆడటానికి, కొన్ని మెళకువలు నేర్చుకోవడానికి ఈ పర్యటన ఎంతో ఉపకరిస్తుందని జానకిరామ్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలుర విభాగం నుంచి టి.సూర్యతేజ (కాకినాడ), ఎం.వెంకట కార్తికేయ (విజయవాడ) ఎంపిక కాగా బాలికల విభాగంలో రాంజలి కాజోల్ సునర్ (విజయవాడ), ఫాల్గుణ్ చార్వి (రాజమండ్రి) ఎంపిక అయ్యారని, వీరితోపాటు కోచ్ కెవి.మురళీమోహన్ పాత్రోను జపాన్‌కు పంపడానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 20న మందా నేతృత్వంలో బందం జపాన్‌కు బయలుదేరుతుందన్నారు. సుమారు 10 రోజుల పాటు జానకిరామ్, జి.పాండు రంగారావుల ఆధ్వర్యంలో ఈ పర్యటన జరుగుతుందని తెలిపారు .టేబుల్ టెన్నిస్‌లో జపాన్‌లోని నిష్ణాతులచే శిక్షణ ఇప్పించడంతో పాటు అక్కడ అన్ని ముఖ్యమైన సందర్శనా స్థలాలకు తీసుకెళ్తారన్నారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ, దేశీయ ఛాంపియన్‌షిప్‌లలో భారత ఆటగాళ్లు రాణించడానికి ఇటువంటి పర్యటనలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో రొటీరియన్ హనుమంతరావు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మానవ హక్కుల పరిరక్షణలో మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు చేస్తున్న సేవలు అమోఘమని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వై.సత్యనారాయణ కొనియాడారు. మానవ హక్కుల కౌన్సిల్ సర్వసభ్య సమావేశం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మానవ హక్కులకు భంగం కలిగిస్తుంటాయన్నారు. అలాంటి సమయంలో మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు పౌర హక్కుల పరిరక్షణకు బాధితుల తరపున చేసే పోరాటాన్ని మరువలేమన్నారు. ముస్ముందూ ఆ పోరాటాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు పౌర హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పౌర హక్కుల ఉల్లంఘన జరిగిన బాధితుల పక్షాన నిలబడి తాము పోరాడి ఎన్నో విజయాలు సాధించామని తెలిపారు. పౌరహక్కుల పరిరక్షణకు రాజీ లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు తరచూ మానవ హక్కులను కాలరాసే విధంగా ప్రవర్తిస్తున్నాయని మండిపడ్డారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే సహించేది లేదని ప్రభుత్వాలను హెచ్చరించారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.రాంబాబు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు న్యాయవాదులుగా తమవంతు కృషి చేస్తామని తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మానవ హక్కులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి బాధితులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. రిటైర్డ్ పోలీస్ అధికారి ఎస్‌వి రమణ మాట్లాడుతూ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు బిఎస్ లత, రాష్ట్ర కోశాధికారి మాధవి గణపతి, నిర్మల (పాడేరు), డాక్టర్ వాసవి పాల్గొన్నారు.